బీఆర్ఎస్‌ను తొక్కేస్తామన్నోళ్లే పత్తాలేరు!

3 ఫీట్లు లేనోడు వంద ఫీట్ల లోతులో పాతరేస్తడా?

- కేసీఆరే లేకుంటే రేవంత్‌కు సీఎం పదవి ఎక్కడిది?
- చార్ సౌ బీస్ హామీలిచ్చి అధికారంలోకి కాంగ్రెస్
- మార్పు కోరుకున్నోళ్లు నేడు నెత్తికొట్టుకుంటున్నరు
- ప్రాజెక్టుల్లో అవినీతి జరిగితే విచారణ జరపండి
- రైతు భరోసా ఇవ్వకుంటే చీల్చి చెండాడుతం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సిరిసిల్లలో నియోజకవర్గ బీఆర్ఎస్ సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్.. భారీగా హాజరైన శ్రేణులు

రాజన్న సిరిసిల్ల, జనవరి 28 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్‌ను తొక్కేస్తామన్నోళ్లే ఇప్పుడు పోటీలో లేకుండాపోయారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పేర్కొన్నారు. 3 ఫీట్లు లేనోడు బీఆర్ఎస్ పార్టీని వంద ఫీట్ల లోతుకు తొక్కుతాడా? అని సీఎం రేవంత్‌కు చురకలంటించారు. 'కేసీఆర్‌ను తొక్కుతం, బొందపెడతం, గులాబీ జెండా కనబడకుండా జేస్తం అని చాలా మాట్లాడుతున్నడు. గతంలో నీ లెక్క పిచ్చిమాటలు, ప్రగల్భాలు మీ గురువర్యులు మాట్లాడిండ్రు. ఇంతకు ముందున్న పెద్ద పెద్ద తీస్‌మార్‌ఖాన్లు మాట్లాడిన్రు. వాళ్లతోనే కాలేదు. నీతోనేమైది'అని ఎద్దేవా చేశారు. 'నీ అసంటోళ్లు మస్తుగస్తరు.. పోతరు. కాలం కలిసొస్తే వానపాము సైతం నాగుపాములై బుసలు కొడుతాయి' అంటూ విమర్శించారు. 'రాహుల్‌గాంధీ భారత్ జోడో అంటుంటే దేశమంతా కాంగ్రెస్ చోడో అంటున్నది. ఆ పార్టీలోని నేతలు ఎక్కడోళ్లు అక్కడికెళ్లుతున్నరు. కేంద్రంలో బీజేపీకి చెక్‌పెట్టే శక్తి కాంగ్రెస్‌కు లేదు. దమ్ము, ధైర్యం తెగింపు, సత్తా అంతకన్నా లేదు. బీజేపీ, మోదీని ఆపాలన్నా.. నిలువరించాలన్నా.. బలమైన నాయకులన్న ప్రాంతీయ పార్టీలతోనే సాధ్యం' అని స్పష్టం చేశారు. కేసీఆర్, మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్, పినరయి విజయన్‌లాంటి నాయకులకు ఓట్లేస్తేనే బీజేపీని ఆపగలుగుతామని చెప్పారు. ఆదివారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అధ్యక్షతన నిర్వహించిన సిరిసిల్ల నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్లమెంటు ఎన్నికలపై అనురించాల్సిన వ్యూహంపై కార్యకర్తలు, శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీ కూడబలుక్కొని ఒక్కటవుతున్నాయని, ప్రజలు గమనించాలని సూచించారు. 2 ఎమ్మెల్సీ స్థానాలకు ఒకేసారి ఉప ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా, రేవంత్ ఢిల్లీకి వెళ్లి అమిత్‌షాను కలిసి వేర్వేరుగా ఎన్నికలు జరిపేలా కుట్ర పన్నారని ఆరోపించారు. ఒకేసారి నిర్వహిస్తే ఒకటి కాంగ్రెస్, మరొకటి బీఆర్ఎస్ గెలిచేదని తెలిపారు. రెండుపార్టీల కుట్రల వల్ల రెండు స్థానాలు కాంగ్రెస్ గెలిచిందని, ఇది కాంగ్రెస్, బీజేపీల మధ్య ఫెవికాల్ బంధం అంటూ విమర్శించారు. దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ పేర్లను క్యాబినెట్ తీర్మానించి పంపితే తిరస్కరించిన గవర్నర్.. కోదండరాం పేరు పంపితే సంతకం చేశారని అన్నారు. అసెంబ్లీలో కాంగ్రెస్ అభ్యర్థి స్పీకర్ ఏకగ్రీవం కావడానికి సహకరించామని, ఆ ఇంగితం తమకు ఉన్నదని తెలిపారు. తెల్లారి అసెంబ్లీ సమావేశంలో గవర్నర్ ప్రసంగం ఓ కాంగ్రెస్ కార్యకర్త గల్లీలో మాట్లాడిన మాటలకన్నా హీనంగా ఉన్నదని, ఆమె నోటికొచ్చినట్టు మాట్లాడారని విమర్శించారు. పదేండ్లు కేసీఆర్ తెలంగాణను నాశనం పట్టించారని, అప్పులపాలు చేశారని, రాష్ర్టాన్ని దివాలా తీయించారంటూ మాట్లాడారని మండిపడ్డారు. ఆర్థికశాఖ శ్వేతపత్రంపై హరీశ్‌రావు, తాను, విద్యుత్తు శాఖపై జగదీశ్‌రెడ్డి తిప్పికొట్టామని చెప్పారు. కేసీఆర్ పంపిన ముగ్గురు సైనికులం గట్టిగా తిప్పికొట్టామని, కేసీఆరే అసెంబ్లీకి వస్తే ఎట్లుంటదో ఆలోచించాలని అన్నారు. అధికారంలోకి వస్తామని వారికే నమ్మకం లేక కాంగ్రెసోళ్లు చార్‌సౌ బీస్ హామీలిచ్చారని ధ్వజమెత్తారు. 'కేసీఆర్ లక్ష రుణ మాఫీ చేసి గెలిచిపోతాడనుకుంటుండు.. నేను డిసెంబర్ 9నాడు రెండు లక్షలు మాఫీ చేస్తా' అన్న రేవంత్ ఇంతవరకూ చేయలేదని విమర్శించారు. మహిళలకు ఫ్రీ బస్సుల సంఖ్యను పెంచాలని, అద్దె బస్సుల అద్దెను పెంచాలని డిమాండ్‌చేశారు. 6 గ్యారెంటీలు అని చెప్పి 13 గ్యారెంటీలు ఇచ్చారని, అవి అమలు చేసే వరకు ప్రజల పక్షాన పోరాడతామని స్పష్టంచేశారు.

సిరిసిల్లను వదిలిపెట్టను

తాను రాజకీయాల్లో ఉన్నంత కాలం సిరిసిల్లను వదలబోనని, మీ అన్నగా, మీ తమ్ముడిగా అండగా ఉంటానని కార్యకర్తలకు కేటీఆర్ భరోసా ఇచ్చారు. రాజకీయ జన్మనిచ్చిన సిరిసిల్ల రుణం తీర్చుకుంటానని పునరుద్ఘాటించారు. అధికారం పోయిందన్న నెపంతో తాను సిరిసిల్లను వదిలి పోతున్నానంటూ ఈ మధ్య పేపర్లు, టీవీల్లో వస్తున్న వార్తలపై ఆయన పై విధంగా స్పందించారు. ఇలాంటి పుకార్లను నమ్మవద్దని కోరారు. మీ శాసన సభ్యుడిగా మీ కోసం శక్తి మేరకు పనిచేస్తానని, సిరిసిల్ల ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉండి, సమస్యల పరిష్కారంపై అసెంబ్లీలో తనగొంతుగా వినిపిస్తానని స్పష్టం చేశారు.

కరీంనగర్‌కు బండి చేసింది సున్నా!

'ఐదేండ్ల కాలంలో ఓ బడి తేలే.. ఓ గుడి తేలే. నేతన్నకు, గీతన్నకు, రైతుకు చివరికి ప్రజలకు పనికొచ్చే ఒక్క పనిచెయ్యలేదు' అంటూ కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ను కేటీఆర్ ఎద్దేవా చేశారు. తెల్లారితే కేసీఆర్‌ను తిట్టుడు, అమిత్‌షా చెప్పులు మోసుడు తప్ప కరీంనగర్ ఎంపీగా ఆయన చేసిందేమిటని నిలదీశారు. ఈ ఐదేండ్ల కాలంలో ఆయన చేసిన పనేంటో ప్రజలకు చెప్పి ఓట్లు అడగాలని సవాల్ విసిరారు. ఎంపీగా బండి విఫలమయ్యారని విమర్శించారు. ఎంపీ ల్యాడ్స్ రూ.5 కోట్లుంటే సంజయ్ అయిదు పైసలన్న తేలేదని మండిపడ్డారు. కరీంనగర్ పార్లమెంట్‌లో ఓటు అడిగే హక్కు బండికి లేదని ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని కార్యకర్తలకు సూచించారు. సిరిసిల్లకు మెగా పవర్‌లూం క్లస్టర్ కావాలని తాను వినోద్‌కుమార్‌తో కలిసి పదిసార్లు ఢిల్లీకి వెళ్లి కేంద్ర ప్రభుత్వాన్ని కలిసి వినతి పత్రాలు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా, కరీంనగర్ ఎంపీగా ఉండి కూడా సిరిసిల్ల, జమ్మికుంటలో ఉన్న నేతన్నల కోసం బండి సంజయ్ ఒక్క పథకం తేలేదని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

అధికారం పోయిందని ఆగంకావొద్దు

అధికారం పోయిందని ఆగంకావొద్దని కార్యకర్తలకు కేటీఆర్ సూచించారు. ఇది చిన్న స్పీడ్ బ్రేకర్ మాత్రమేనని చెప్పారు. వంద స్పీడుతో ఇరవైనాలుగున్నరేండ్లు ఉరికామని, సర్వీసింగ్ అవసరం పడదా? అని అన్నారు. తప్పకుండా మళ్లీ మనమే వస్తామని, ప్రజలు మనదగ్గరకే వస్తారని చెప్పారు. ప్రజలు మనల్ని తీసి అవతల పారేయలేదని, 119 నియోజకవర్గాల్లో జరిగిన ఎన్నికల్లో ప్రజలు గౌరవప్రదంగా 39 స్థానాలు అంటే మూడో వంతు ఇచ్చారని, 14 స్థానాల్లో కేవలం నాలుగైదు వేల ఓట్ల తేడాతోనే ఓడిపోయామని తెలిపారు. అందులో సగం గెలిచినా అధికారంలోకి వచ్చేవాళ్లమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ 39.8%, బీఆర్ఎస్‌కు 37% ఓట్లు రాగా, 1.8 శాతం తేడా మాత్రమే ఉన్నదని అన్నారు. ఈ ఏడాదంతా మనకు ఎన్నికలున్నాయని, పార్లమెంటు ఎన్నికల్లో గట్టిగా పని చేస్తేనే గట్టి పునాది పడుతుందని చెప్పారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తాను పార్టీ కార్యకర్తల కోసం పనిచేస్తానని చెప్పారు.

ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్: వినోద్

సాధ్యంకాని హామీలిచ్చి సామాన్య ప్రజల్ని మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. పదేండ్లలో కేసీఆర్ ఎంతో అభివృద్ధి చేసినప్పటికీ కాంగ్రెస్ పార్టీకి ఓటేసినం అని రైతులు ఇప్పుడు బాధపడుతున్నారని అన్నారు. కేసీఆర్‌కు గిరిజనులు, పేదలపై ఉన్న ప్రేమతో 33 జిల్లాలు చేసి, ప్రతి జిల్లాకు మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. జిల్లాలను కుదించాలన్న కాంగ్రెస్ సర్కారు కుట్రలను తిప్పికొడుతామని హెచ్చరించారు. ప్రభుత్వంలో ప్రతిపక్షపార్టీకే ఎక్కువ పనులవుతాయని చెప్పారు. సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు 9 నియోజకవర్గాల సమావేశాలు

- చేవెళ్ల, పరిగికి హాజరుకానున్న కేటీఆర్

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికలకు పార్టీ క్యాడర్‌ను సన్నద్ధం చేయడానికి భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నియోజకవర్గ స్థాయి సమావేశాల నిర్వహణకు పూనుకొన్నది. అందులోభాగంగా సోమవారం తొమ్మిది నియోజకవర్గాల సమావేశాలు నిర్వహించనున్నది. చేవెళ్ల, పరిగి నియోజకవర్గాల సమావేశాలకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్నారు. ఉదయం 11 గంటలకు చేవెళ్ల నియోజకవర్గ సమావేశం స్థానిక కేజీఆర్ గార్డెన్‌లో, మధ్యాహ్నం 2 గంటలకు పరిగి నియోజకవర్గ సమావేశం ఎస్ గార్డెన్‌లో జరుగనున్నది. ఈ నియోజకవర్గాలతోపాటు ఆలేరు, నర్సంపేట, ఖైరతాబాద్, ఆందోల్, జగిత్యాల, జుక్కల్, వర్ధన్నపేట సమావేశాలు జరుగనున్నాయి. ఈ సమావేశాలకు పార్టీ ముఖ్య నేతలు హాజరవుతారు.

రేవంత్‌ది మేనేజ్‌మెంట్ కోటా!

'నువ్వు ప్రజలు ఎన్నుకున్న ముఖ్యమంత్రివి కాదు.. ఢిల్లీని మేనేజ్ చేసుకొని మాణిక్యం ఠాకూర్‌కు రూ.50 కోట్లు ఇచ్చి మేనేజ్‌మెంట్ కోటాలో సీఎం పదవి తెచ్చుకున్నవ్. ఎన్నటికీ, ముమ్మాటికీ కేసీఆర్ కాలిగోటికి కూడాసరిపోవు' అంటూ రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ ధ్వజమెత్తారు. తాను వేరే ఉద్దేశంతో అనడం లేదని, కేసీఆర్ అనే వ్యక్తి లేకపోతే తెలంగాణ ఎక్కడిది? రాష్ర్టానికి వచ్చే ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పదువులు ఎక్కడివి అని? ప్రశ్నించారు. ప్రాజెక్టులపై అవినీతి జరిగితే ఎంక్వైరీ చేసి చర్యలు తీసుకోవాలని సవాల్ విసిరారు. వచ్చే పంట వరకు రైతు భరోసా ఇవ్వకుంటే కాంగ్రెస్ పార్టీని చీల్చి చెండాడుతామని హెచ్చరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని స్వాగతిస్తున్నామని, ఉపాధి కోల్పోయి రోడ్డునపడ్డ ఆటోవాలాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మార్పు కోరి కాంగ్రెస్ పార్టీకి ఓటేసి గెలిపించినోళ్లంతా ఇప్పుడు తలలు పట్టుకుంటున్నారని చెప్పారు. ఓటు వేయలేదన్న సాకుతో నేతన్నలపై కక్షసాధింపులకు పాల్పడితే 39 మంది పార్టీ ఎమ్మెల్యేలం కలిసి ప్రభుత్వాన్ని దిగ్బంధిస్తామని హెచ్చరించారు. నేతన్నలకు అండగా ఉండి వారికి వచ్చే సంక్షేమ పథకాలు అమలయ్యేదాక పోరాడుతామని చెప్పారు.

మెదక్‌లో బీఆర్ఎస్ నియోజకవర్గ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు. చిత్రంలో బీఆర్ఎస్ నేతలు పద్మాదేవేందర్‌రెడ్డి, ఆర్ సత్యనారాయణ, దేవేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ తదితరులు

హామీలు నెరవేర్చకుంటే కర్రుకాల్చి వాత!

కాంగ్రెస్‌కి ప్రజలే తగిన బుద్ధి చెప్తారు

- ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి
- ఎన్నికల కోడ్ రాకముందే హామీలన్నీ నెరవేర్చాలి
- 4వేల పింఛన్.. మహిళలకు 2,500 సాయం ఏది?
- కర్ణాటకలో గ్యారెంటీలపై చేతులెత్తేసిన కాంగ్రెస్
- రేవంత్‌కు సీఎం కుర్చీ కేసీఆర్ పెట్టిన భిక్ష: హరీశ్‌రావు
- మెదక్‌లో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

మెదక్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): మార్చిలోగా ఆరు గ్యారెంటీలను అమలు చేయకుంటే కాంగ్రెస్ పార్టీకి ప్రజలే కర్రు కాల్చి వాతపెడతారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు హెచ్చరించారు. అలవికాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ప్రజలకు మొండి చెయ్యి చూపుతున్నదని మండిపడ్డారు. ఆదివారం ఆయన మెదక్ జిల్లాకేంద్రంలోని వైస్రాయ్ గార్డెన్స్‌లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని, మాట్లాడారు. కర్ణాటకలో అనేక హామీలిచ్చి కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిందని, గెలిచి ఎనిమిది నెలలవుతున్నా ఒక్క హామీ సరిగ్గా అమలు చేయడం లేదని తెలిపారు. కాంగ్రెస్ సర్కారుపై ప్రజలకు భ్రమలు తొలగిపోయాయని, ఆరు నెలలు ఓపిక పడితే ప్రజలు వచ్చే అన్ని ఎన్నికల్లో బీఆర్ఎస్‌కే ఓట్లు వేస్తారని చెప్పారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కర్ణాటకలో బీజేపీ, తెలంగాణలో బీఆర్ఎస్ ఎక్కువ స్థానాలు గెలవడం ఖాయమని పేర్కొన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ చేయకుండా పార్లమెంట్ ఎన్నికలకు వెళ్తే కాంగ్రెస్‌కు రైతులు ఓట్లేయరని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ రాకముందే హామీలను అమలుచేసి, కాంగ్రెస్ పార్టీ తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని హితవు పలికారు. తాము ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇవ్వని హామీలను కూడా అమలు చేశామని, కాళేశ్వరం నీళ్లు తెచ్చి రైతుల కాళ్లు కడిగామని గుర్తుచేశారు. ఇంటింటికీ మంచినీళ్లు, రాష్ట్రంలో 11 లక్షల మంది ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి ఇచ్చామని చెప్పారు. రైతుబంధు హామీ ఎన్నికల్లో ఇవ్వకపోయినా అమలు చేశామని గుర్తు చేశారు. కరోనా కష్ట సమయంలో సైతం ప్రభుత్వం వద్ద పైసలు లేకున్నా బిల్లులు, ఎమ్మెల్యేల జీతాలు ఆపి రైతుబంధు ఇచ్చామని, ఇప్పుడు ఏ సమస్య లేకపోయినా కాంగ్రెస్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ సర్కారు దళితబంధు పక్కన పెట్టిందని, గొల్లకుర్మలకు గొర్రెలు ఇవ్వడం లేదని, రూ.2 లక్షల సాయం కూడా అందలేదని పేర్కొన్నారు.

హామీలపై ప్రశ్నిస్తే దాడులకు దిగుతారా?

రూ.4 వేల పింఛన్, మహిళలకు రూ.2500 సాయం ఏమయ్యాయని కాంగ్రెస్ సర్కారును హరీశ్‌రావు ప్రశ్నించారు. ఇచ్చిన హామీలపై ప్రశ్నిస్తే బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడి చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలకు పాలన చేతకాక ప్రతిపక్షాల మీద దాడులు చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా తెలంగాణను ఎలా అభివృద్ధి చేయాలనే పనిమీద ఉంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ప్రతిపక్షాలపై ఎలా దాడి చేయాలన్న కోణంలో ఆలోచిస్తున్నది అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ నేతలపై కేసులు పెడితే ప్రజలే తిరగబడతారని హెచ్చరించారు. మంచినీళ్లు ఇవ్వకుంటే ఓట్లు అడగబోమని చెప్పిన దమ్మున్న లీడర్ ఒక్క కేసీఆర్ మాత్రమేనని తెలిపారు. ప్రజలకు సన్నబియ్యం ఇవ్వాలని తాము భావిస్తే కాంగ్రెస్ వాళ్లు ఉన్న బియ్యం ఇవ్వడం లేదని ఎద్దేవా చేశారు. డీడీలు కట్టినా ఎందుకు గొర్రెలు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. సెక్రటేరియేట్‌లో కంప్యూటర్లు, ఫైల్స్ ఉంటాయని, లంకె బిందెలు ఉండవని, లంకెబిందెలు లేవనే సాకుతో పార్లమెంట్ ఎన్నికల తర్వాత చేతులు ఎత్తేస్తారా? అని రేవంత్‌కు చురకలంటించారు. తెలంగాణ రాష్ర్టాన్ని తీసుకువచ్చిన కేసీఆర్ భిక్షతోనే ఈ రోజు రేవంత్‌రెడ్డి సీఎం కుర్చీలో కూర్చున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఆర్ సత్యనారాయణ, బీఆర్ఎస్ నాయకులు దేవేందర్‌రెడ్డి, కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

- 2లోగా ఇవ్వకపోతే ఆమరణ దీక్షలు
- రాష్ట్ర సర్పంచుల సంఘం హెచ్చరిక

రవీంద్రభారతి, జనవరి 28: సర్పంచులకు పెండింగ్ బిల్లులను ఫిబ్రవరి 2లోగా విడుదల చేయాలని, లేనిపక్షంలో స్పెషల్ ఆఫీసర్లను అడ్డుకుని, గ్రామపంచాయతీలకు తాళాలు వేసి ఆమరణ నిరాహార దీక్షలు చేపడుతామని తెలంగాణ సర్పంచుల సంఘం హెచ్చరించింది. వడ్డీల మీద వడ్డీలు పెరిగి సర్పంచులు ఆత్మస్థైర్యం కోల్పోయి ఆత్మహత్యలు చేసుకొనే ప్రమాదం ఉన్నదని ఆవేదన వ్యక్తంచేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి కొలను శ్రీనివాస్‌రెడ్డి, సహాయ కార్యదర్శి బిట్టు శ్రీనివాస్ మాట్లాడుతూ.. క్రీడాప్రాంగణం, రైతువేదిక, శ్మశానవాటిక, పంచాయతీ భవన నిర్మాణాల పెండింగ్ నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు. జనవరి 31న సర్పంచుల కాల పరిమితి ముగిసిపోనున్నందున ఎన్నికలు జరిగే వరకు గౌరవంగా సర్పంచులు కొనసాగేలా చూడాలని కోరారు.

బీఆర్ఎస్ ముషీరాబాద్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎల్ రమణ. చిత్రంలో ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, మాగంటి గోపీనాథ్ తదితరులు

విజయమే లక్ష్యంగా పనిచేయాలి

బీఆర్ఎస్ కార్యకర్తలకు ఎమ్మెల్సీ ఎల్ రమణ సూచన

కవాడిగూడ, జనవరి 28 : కార్యకర్తలే పార్టీకి బలం అని ముషీరాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ ఎల్ రమణ అన్నారు. ఆదివారం ముషీరాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం ముషీరాబాద్‌లోని కష్ష్ హాల్‌లో భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై శ్రీనివాస్‌రావు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ ఎల్ రమణ మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నగరంలోని 23 స్థానాల్లో బీఆర్ఎస్ విజయం సాధించిందని, ఇది కార్యకర్తల అండదండలతోనే సాధ్యమైందని తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ అధిష్ఠానం కార్యకర్తలకు ఎళ్లవేళలా అండగా నిలుస్తుందని భరోసానిచ్చారు. ప్రజా సమస్యలపై పోరాడుతూ ప్రజలకు అండగా నిలువాలని సూచించారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ.. కార్యకర్తల అండ, ప్రజల మద్దతుతో అసెంబ్లీ ఎన్నికల్లో భారీవిజయం సాధించినట్టు తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్ మాట్లాడుతూ.. కేసీఆర్ సర్కార్ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేయాలని సూచించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. బీజేపీ నాయకుల మాయమాట లకు మోసపోవద్దని సూచించారు. త్వరలో కమిటీలు వేసి సీనియర్లకు, తెలంగాణ ఉద్యమకారులకు పార్టీకోసం కష్టపడే కార్యకర్తలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబు యాదవ్, బీఆర్ఎస్ నాయకుడు ముఠా జైసింహ, మాజీ కార్పొరేటర్లు ముఠా పద్మ, మాచర్ల పద్మజ, పార్టీ సీనియర్ నాయకుడు బింగి నవీన్, డివిజన్ల బీఆర్ఎస్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే భూమి కొనుగోలు

- మాజీ సీఎస్ సోమేశ్ కుమార్ వివరణ

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా యాచారం మండలం కొత్తపల్లిలో తాను నిబంధనలకు అనుగుణంగానే భూమి కొనుగోలు చేసినట్టు మాజీ సీఎస్ సోమేశ్‌కుమార్ స్పష్టంచేశారు. సర్వేనంబర్ 249, 260లో సుమారు 25 ఎకరాల భూమి సోమేశ్ భార్య పేరిట ఉన్నది. అక్రమ సంపాదనతో ఆయన భూమి కొన్నారని ఆరోపణలు వచ్చాయి. ఈ భూమి కొనుగోలుపై సోమేశ్ డీవోపీటీకి సమాచారం ఇవ్వలేదని కాంగ్రెస్ నాయకుడు మన్నె నర్సింహారెడ్డి ఆరోపించారు. ప్రభుత్వం దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో సోమేశ్ ఆదివారం స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం తనకు ప్రశాసన్ నగర్‌లో కేటాయించిన నివాస స్థలంలో నిర్మించిన ఇంటిని అమ్మేసి కొత్తపల్లిలో 2018లోనే వ్యవసాయ భూమి కొనుగోలు చేసినట్టు వివరించారు. భూమి కొనుగోలుకు అనుమతిస్తూ ప్రభుత్వం తనకు లేఖ కూడా ఇచ్చిందని తెలిపారు.

దాడులు చేస్తే ప్రతిదాడులు తప్పవు

- కాంగ్రెస్‌కు ఎర్రబెల్లి హెచ్చరిక
- బీఆర్ఎస్‌ను బొందపెట్టడం మీ అబ్బ తరం కూడా కాదు
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఫైర్
- కాంగ్రెస్, బీజేపీ మిలాఖత్: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- పాలకుర్తిలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

పాలకుర్తి నియోజకవర్గస్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా. చిత్రంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ మంత్రి ఎర్రబెల్లి తదితరులు

జనగామ, జనవరి 28 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కాంగ్రెస్ నాయకులు దాడులు చేస్తే ప్రతి దాడులు తప్పవని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హెచ్చరించారు. పాలకుర్తి నియోజక వర్గంలో కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యే గొడవలు సృష్టిస్తున్నారని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికలపై ఆదివారం నిర్వహించిన జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల విస్తృత సమావేశం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అధ్యక్షతన జరిగింది. స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ హాజరైన ఈ సమావేశంలో ఎర్రబెల్లి మాట్లాడుతూ.. నాయకులు, కార్యకర్తలు అధైర్యపడొద్దని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పాలకుర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి 50 వేల మెజారిటీ సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలు, నాయకులు సమిష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ సహకారంతో పాలకుర్తి నియోజకవర్గానికి వేల కోట్ల నిధులు తెచ్చి అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినట్టు తెలిపారు. మంజూరైన నిధులను అడ్డుకుంటే ధర్నాలు తప్పవని హెచ్చరించారు.

కాంగ్రెస్, బీజేపీలవి మిలాఖత్ రాజకీయాలు

కాంగ్రెస్, బీజేపీలది మిలాఖత్ రాజకీయాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇరు పార్టీల రహస్య మైత్రి బయట పడిందని ఆరోపించారు. గవర్నర్ రాజకీయాలు చేయడం సరికాదని సూచించారు. పార్టీ అధ్యక్షుడిగా ఉన్నా కోదండరాంను ఎమ్మెల్సీగా ఎలా అంగీకరించారో గవర్నర్ చెప్పాలని ప్రశ్నించారు. కోదండరాం ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా పోటీ చేశారని గుర్తుచేశారు. ప్రొఫెసర్ దాసోజ్ శ్రావణ్, ఎరుకల సామాజిక వర్గానికి చెందిన సత్యనారాయణను ఎమ్మెల్సీగా ఎంపిక చేస్తే గవర్నర్ అడ్డుకున్నారని తెలిపారు. రంగనాయక సాగర్‌పై మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు హాస్యాస్పదమని అన్నారు. అక్రమ కేసులు, అవిశ్వాసాలకు భయపడేది లేదని చెప్పారు.

సర్పంచ్ ఎన్నికలంటే కాంగ్రెస్‌కు భయం: ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్

సర్పంచ్ ఎన్నికలంటే కాంగ్రెస్‌కు భయమని అందుకే పదవీ కాలం ముగిసినా ఎన్నికలు నిర్వహించకుండా వాయిదా వేసిందని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ విమర్శించారు. పంచాయతీ ఎన్నికలను పక్కన పెట్టి అవిశ్వాసాలకు తెరలేపిందని మండిపడ్డారు. కాంగ్రెస్‌వి అమలు కానీ హామీలని విమర్శించారు. 50 రోజుల్లోనే కరెంట్ కోతలు మొదలయ్యాయని, రైతుబంధుకు రాంరాం చెప్పారని ఆరోపించారు. కాంగ్రెస్ మంత్రులు, నాయకులు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎన్ సుధాకర్‌రావు, రాజ్యసభ మాజీ సభ్యుడు రాపోలు ఆనంద్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తాచాటుతాం: కడియం

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తాచాటుతామని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఉద్యమ పార్టీగా అవతరించి ప్రత్యేక రాష్ర్టాన్ని సాధించిన బీఆర్ఎస్ పార్టీ ప్రశ్నించే గొంతుకగా ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని తెలిపారు. త్యాగాల పునాదిపై అవతరించిన బీఆర్ఎస్‌ను వందమీటర్ల లోతులో తొక్కడం, 39 ముక్కలు చేయడం సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అబ్బతరం కూడా కాదని స్పష్టంచేశారు. ముఖ్యమంత్రి, మంత్రులు మాట్లాడే భాష మార్చుకోవాలని సూచించారు. రేవంత్‌రెడ్డి రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న సంగతి మర్చిపోయి కాంగ్రెస్ కార్యకర్తలా మాట్లాడటం విడ్డూరంగా ఉన్నదని తెలిపారు. రేవంత్ చరిత్ర తెలుగు రాష్ర్టాల ప్రజలకు బాగా తెలుసని, ఆయన గురించి కొత్తగా మాట్లాడాల్సిన పనిలేదని చెప్పారు. సభ్యత, సంస్కారం మర్చిపోయి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును విమర్శించడం మంచిది కాదని హెచ్చరించారు. ముఖ్యమంత్రి ప్రతిపక్ష నాయకులపై విమర్శలు మానుకొని ప్రజాపాలనపై దృష్టి సారించాలని హితవు పలికారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయడం రేవంత్‌రెడ్డితో సాధ్యం కాదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానివి మాటలు తప్ప చేతల్లో పని కావడం లేదన్నారు. కొద్దిరోజుల్లోనే రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత వస్తుందని కడియం వ్యాఖ్యానించారు.

అసభ్య భాషకు అంబాసిడర్ రేవంత్

- రేవంత్‌రెడ్డి- కిషన్‌రెడ్డి మధ్య రహస్య మైత్రి
- త్వరలోనే వివరాలు బయటపెడతా
- రేవంత్‌రెడ్డి స్థాయికి కేటీఆర్ దిగజారలేరు
- బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్‌పార్లమెంటరీ భాషకు బ్రాండ్ అంబాసిడర్ అని, కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ గురించి మాట్లాడటం మానేసి సీఎం భాష గురించి స్పందించాలని బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి సూచించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో మీడియా తో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డి మధ్య రహస్య మైత్రి కుదిరిందని ఆరోపించారు. త్వరలోనే దానిని బయటపెడతానని తెలిపారు. కేటీఆర్ స్థాయి గురించి మల్లు రవి మాట్లాడడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. అన్‌పార్లమెంటరీ భాష గురించి మాట్లాడాల్సి వస్తే తొలుత రేవంత్ గురించి మాట్లాడాలని సూచించారు. గతంలో ఎవరూ రేవంత్‌లా బజారు భాష మాట్లాడలేదని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నామన్న సోయి మరిచి రేవంత్ ఇంకా ఎన్నికల సభల్లో మాట్లాడినట్టే మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సుమతీ శతకంలోని పద్యంతో కేటీఆర్ తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు తప్పితే రేవంత్ స్థాయికి దిగజారలేదన్నారు.

మల్లు వ్యాఖ్యలు హాస్యాస్పదం

తెలంగాణకు దేశంలోనే అత్యుత్తమ పాలనా భవనాన్ని కేసీఆర్ అందించారని శ్రీధర్‌రెడ్డి కొనియాడారు. అలాంటి సచివాలయం జైలులా ఉందని మల్లు రవి మాట్లాడడం హాస్యాస్పదమని మండిపడ్డారు. కేసీఆర్ ఏం చేసినా కాంగ్రెస్‌కు చెడుగానే కనిపిస్తున్నదని ధ్వజమెత్తారు. కేసీఆర్ తెలంగాణకు స్వేచ్ఛా వాయువులు ప్రసాదిస్తే తెలంగాణ మొత్తాన్ని జైలులా మార్చిన ఘనత కాంగ్రెస్‌దేనని విమర్శించారు. ప్రధాని మోదీని రేవంత్ కలిసిన తర్వాతే రాష్ట్రంలో పెట్టుబడులకు అదానీ ముందుకు వచ్చారని పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ ఆదేశాలకంటే మోదీ ఆదేశాలనే రేవంత్‌రెడ్డి ఎక్కువగా పాటిస్తున్నారని ఆరోపించారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ కంటే బీఆర్ఎస్ అత్యధిక స్థానాలను గెలుచుకుంటుందని శ్రీధర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

తెలంగాణ - కజకిస్థాన్ సత్సంబంధాలకు కృషి

- కజకిస్థాన్ గౌరవ కాన్సుల్ హెచ్ఈ

కొండాపూర్, జనవరి 28: తెలంగాణ, కజకిస్థాన్‌ల మధ్య సత్సంబంధాల బలోపేతానికి కృషిచేస్తున్నట్టు కజకిస్థాన్ గౌరవ కాన్సుల్ హెచ్ఈ డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీఖాన్ అన్నారు. హైదరాబాద్ నుంచి నేరుగా కజకిస్థాన్‌కు విమానాన్ని ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. కజకిస్థాన్ కాన్సులేట్ 3వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం మాదాపూర్‌లో నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడుతూ.. మూడేండ్ల కాలంలో అనేక మైలురాళ్లను తమ ఖాతాలో వేసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీజీపీ రవి గుప్తా, రిపబ్లిక్ ఆఫ్ టర్కీ కాన్సులేట్ జనరల్ హెచ్ఈ ఓర్హాన్ యల్మాన్ ఓకాన్, యూఏఈ కాన్సుల్ జనరల్ హెచ్ఈ ఆరిఫ్ అల్నూయి, ఏఐసీసీ కార్యదర్శి మధుయాష్కీ గౌడ్, నిర్మాత అల్లు అరవింద్, ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి జొన్నలగడ్డ స్నేహజ పాల్గొన్నారు.

రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి కృషి

- సంస్థ ఎండీ వీసీ సజ్జనార్

హైదరాబాద్, జనవరి 28(నమస్తే తెలంగాణ): ఆర్టీసీ రిటైర్డ్ అధికారులు, సిబ్బంది సంక్షేమానికి యాజమాన్యం కట్టుబడి ఉన్నదని ఆ సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. ఆదివారం ఖైరతాబాద్‌లో రిటైర్డ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 5వ వార్షిక సమావేశం జరిగింది. ప్రజారవాణా వ్యవస్థ బాగుకోసం రిటైర్డ్ ఉద్యోగులు అకుంఠిత దీక్ష, క్రమశిక్షణతో చేసిన సేవలు గొప్పవని సజ్జనార్ కొనియాడారు. ఈ సందర్భంగా 75 ఏండ్లు నిండిన 41 మంది రిటైర్డ్ అధికారులను సన్మానించారు.